


అమరావతిలో హైకోర్టు జస్టిస్

అమరావతి: అమరేశ్వరుడిని గురువారం హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి దర్శించుకున్నారు. స్వామికి అభిషేకం, బాలచాముండేశ్వరీదేవికి కుంకుమపూజలు నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 1,216 క్యూసెక్కులు వదిలారు. కొమ్మమూరు కాల్వకు 640 క్యూసెక్కులు విడుదల చేశారు.

నేడు స్పటిక శివలింగం ప్రతిష్ఠ

సత్రశాల(రెంటచింతల): గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో గురువారం ఉదయం స్పటిక శివలింగాన్ని ప్రతిష్ఠించనున్నట్లు సత్రశాల ట్రస్ట్‌బోర్డు ౖచైర్మన్ బద్దూరి బ్రహ్మారెడ్డి తెలిపారు. శివలింగాన్ని జైపూర్‌లో తయారు చేయించినట్లు తెలిపారు.



న్యూస్‌రీల్

రేపు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రాక

గుంటూరు వెస్ట్: వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో పాల్గొనేందుకు ఈనెల 24న గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని చల్లావారిపాలెం గ్రామానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్నారని, ఈ కార్యక్రమ జయప్రదానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులకు తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జేసీ జి.రాజకుమారితో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించేందుకు సిద్ధం చేసిన ప్రచార వాహనాన్ని గవర్నర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. గవర్నర్ పర్యటన కోసం పటిష్ట ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీఓ పి.శ్రీకర్, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ యాత్రను జయప్రదం చేద్దాం

పల్నాడు కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: జిల్లాలో ఈనెల 26 నుంచి జనవరి 26 వరకు నెలరోజులపాటు నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కలెక్టర్ ఎల్.శివశంకర్ మండల అధికారులను కోరారు. బుధవారం కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, మండల అధికారులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్సు నిర్వహించారు. జిల్లాకు నాలుగు ఐఈసీ (ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) వాహనాలు రానున్నాయని, వీటికి ఘనంగా స్వాగతం పలకాలని సూచించారు. జిల్లా నోడల్ అధికారులు సూచించిన రూట్ మ్యాప్ ఆధారంగా అన్ని గ్రామ పంచాయతీల్లో వంద శాతం యాత్ర పూర్తి చేయాలన్నారు. విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ గజ్జల శ్రీనివాసరెడ్డి, డీపీవో భాస్కర్‌రెడ్డి, ఉద్యానవన శాఖాధికారి బెన్ని పాల్గొన్నారు.

వట్టిచెరుకూరు, ఫిరంగిపురం పీఎస్‌లకు ఎస్‌హెచ్‌ఓలు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రాష్ట్రంలోని పలు పోలీస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో భాగంగా గుంటూరు జిల్లాలోని రెండు పోలీస్ స్టేషన్లకు అవకాశం కల్పించారు. వట్టిచెరుకూరు పోలీస్‌స్టేషన్, ఫిరంగిపురం పోలీస్‌స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయగా, ఇక నుంచి ఎస్‌హెచ్‌ఓ (స్టేషన్ హౌస్ ఆఫీసర్)గా సీఐ స్థాయి పోలీస్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. త్వరలో ఆయా పీఎస్‌లకు ఎస్‌హెచ్‌ఓల నియమాకం జరగనుంది.

టిడ్కో ఇళ్లలో విద్యుత్, నీటి సమస్యలకు పరిష్కారం



మంగళగిరి : టిడ్కో ఇళ్ల వద్ద విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యతోపాటు తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. వైఎస్సార్ జగనన్న కాలనీ(టిడ్కో) ఇళ్ల వద్ద రూ. 8 కోట్లతో ఆధునిక సాంకేతికతతో నిర్మించిన పూర్తి ఇండోర్ సబ్‌స్టేషన్‌ను బుధవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి విద్యుత్ శాఖ సీఎండీ పద్మజనార్దనరెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపచేశారు. కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ డి.జయభారతరావు, ఎస్‌ఈ డాక్టర్ పి.విజయకుమార్, డీఈలు టి.తులసీరామ్, సిహెచ్ రాంభట్లు, వెంకటేశ్వర్లు, డీఈఈ అక్కల సత్యనారాయణ పాల్గొన్నారు.

యార్డులో 30,591 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 30,479 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,591 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది.

ప్రగతి వేడుక

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో రోడ్లు, వంతెనలకు మహర్దశ
- పరిపాలన అనుమతుల సహా జీవో జారీ
- టెండర్ల ప్రక్రియ వేగవంతం

తెనాలి: పట్టణాలను కలిపే గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ రహదారుల్లో అవసరమైన వంతెనల నిర్మాణానికీ పూనుకుంది. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా భారీమొత్తం నిధులను కేటాయిస్తూ పరిపాలన అనుమతులు సహా జీఓ జారీచేసింది. టెండర్ల ప్రక్రియ వేగంగా పూర్తిచేసి నిర్మాణ పనుల ప్రారంభానికి సన్నాహాలు చేస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పలు రహదారులు, వంతెనల నిర్మాణానికి రూ.160 కోట్లను కేటాయించింది.

జీఓ నంబర్ 788 జారీ

రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో రద్దీ ఎక్కువగా ఉండే 202 రోడ్లలో రూ.784.22 కోట్లతో పూర్తిస్థాయి మరమ్మతులు/పునర్నిర్మాణానికి గతంలో ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. వీటికి అదనంగా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ప్రస్తుతం 916.22 కిలోమీటర్ల పొడవున మరో 115 తారురోడ్లను కొత్తగా నిర్మించనుంది. రోడ్ల మార్గమధ్యంలో ఉండే 6.670 కిలోమీటర్ల పొడవైన 72 పెద్దస్థాయి వంతెనలను పునర్నిర్మించనుంది. రోడ్ల నిర్మాణానికి రూ.576.15 కోట్లు, వంతెనల నిర్మాణానికి మరో రూ.469.29 కోట్లు కలిపి మొత్తం రూ.1,045.44 కోట్లు కేటాయించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఈనెల 15న జీవో నెం.788 జారీచేసింది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో..

వీటిలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 95.18 కిలోమీటర్ల పొడవైన 14 రోడ్లు, 10 వంతెనలు ఉన్నాయి. రోడ్ల నిర్మాణానికి రూ.76.07 కోట్లు, వంతెనల నిర్మాణానికి రూ.83.49 కోట్లు కలిపి మొత్తం రూ.159.56 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. వీటి నిర్వహణ వ్యయంగా మరో రూ.7.24 కోట్లు విడిగా కేటాయించింది. టెండర్ల ప్రక్రియ వేగవంతం చేసి వీలైనంత త్వరగా పనుల ప్రారంభానికి అధికారులు చర్యలు చేపడుతున్నారు.



త్వరలో పునర్నిర్మించనున్న కొల్లిపర వంతెన

ఉమ్మడి గుంటూరు జిల్లాలో నిర్మించే రోడ్లు ఇవే..

- అమృతలూరు మండలం తెనాలి–చందోలు ఆర్‌అండ్‌బీ రోడ్డులో 16.80 కి.మీ. నుంచి అమృతలూరు–పాంచాళవరం (వయా యలవర్రు, గోవాడ) 7.27 కి.మీ. మేర రూ.6.25 కోట్లతో రోడ్డు నిర్మాణం.
- బాపట్ల పరిధిలో ఎన్‌హెచ్–216లో కమ్మ కల్యాణ మండపం–పేరలి మధ్య రూ.4.78 కోట్లతో 7.33 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం.
- దాచేపల్లి అగ్రహారం నుంచి చెన్నాయపాలెం వయా తంగెడ దారిలో రూ.9.26 కోట్లతో 7.89 కి.మీ. మేర రోడ్డు నిర్మాణం.
- దుగ్గిరాల మండలంలో టీఎం రోడ్డు నుంచి మంచికలపూడి, కంఠంరాజు కొండూరు, పెనుమూలి మీదుగా ఉప్పలపాడు దారిలో 4.20 కి.మీ. మేర రూ.3.65 కోట్లతో రోడ్డు నిర్మాణం.
- క్రోసూరు పరిధిలో పీసపాడు త్యాళ్లూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో త్యాళ్లూరు నుంచి పెదపాలెం వరకు 9.41 కి.మీ. మేర రూ.6.36 కోట్లతో నిర్మాణం.
- నిజాంపట్నం మండలంలో టీ–15 ఆర్‌అండ్‌బీ రోడ్డులో 16 కి.మీ. నుంచి కొనపాలెం వరకు 3.35 కి.మీ. మేర రోడ్డుకు రూ.2.53 కోట్లు కేటాయింపు.
- టీ–14 ఆర్ అండ్ బీ రోడ్డులో 25 కి.మీ నుంచి సీబీఎస్ ఆర్‌అండ్‌బీ రోడ్డులో 4 కి.మీ. వరకు 7.73 కి.మీ మేర రూ.5.68 కోట్లతో నిర్మాణం.
- పెదకాకాని మండలంలో టీ20–ఎస్‌హెచ్–5 417+0.67 కి.మీ. నుంచి జొన్నలగడ్డ వరకు 5.90 కి.మీ. మేర రోడ్డుకు రూ.4.71 కోట్లు కేటాయింపు.
- టీ07–పిడుగురాళ్ల నుంచి జానపాడు మీదుగా గుత్తికొండకు 6.03 కి.మీ. రోడ్డుకు రూ.4.66 కోట్లు.
- పిట్టలవానిపాలెం నుంచి ఆల్కాపురం కేశవపురి ఎస్టీ కాలనీ మీదుగా గణపవరం వరకు 7.40 కి.మీ. మేర రోడ్డుకు రూ.5.38 కోట్లు.
- పొన్నూరు మండలం టీ26–జీబీసీ ఆర్‌అండ్‌బీ రోడ్డులో 25.60 కి.మీ. నుంచి కట్టెంపూడి మీదుగా మామిళ్లపల్లి వరకు 5.41కి.మీ. మేర రూ. 5.19 కోట్లతో రోడ్డు నిర్మాణం.
- చుండూరు మండలం కూచిపూడి–సంగంజాగర్లమూడి రోడ్డులో చినపరిమి 2.4 కి.మీ. నుంచి సంగంజాగర్లమూడి–యడ్లపల్లి రోడ్డు సంగంజాగర్లమూడి వరకు 7.35 కి.మీ. మేర రూ.5.13 కోట్లతో రోడ్డు.
- వట్టిచెరుకూరు పరిధిలో లేమల్లెపాడు నుంచి ముట్లూరు మీదుగా పాతకొల్లిమెర్ల వరకు 8.07 కి.మీ. రోడ్డుకు రూ.6.91 కోట్లు కేటాయింపు.
- వేమూరు నుండి చంపాడు, పోతుమర్రు మీదుగా కూచిపూడి వరకు 7.85 కి.మీ. మేర రోడ్డును రూ.5.58 కోట్లతో నిర్మాణం

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఇలా..

మొత్తం		నిధులు (రూ.కోట్లలో)
రోడ్లు	14	76.07
వంతెనలు	10	83.49
నిర్వహణ వ్యయం నిమిత్తం		7.24
మొత్తం		166.8

పనులు చేపట్టనున్న వంతెనలు ఇవీ..

- బాపట్ల పరిధిలో కమ్మ కల్యాణమండపం–పేరలి రోడ్డులో నల్లమడ డ్రెయిన్‌పై రూ.14.10 కోట్లతో వంతెన నిర్మిస్తారు.
- దాచేపల్లిలో ఎస్‌బీ అగ్రహారం నుంచి తంగెడ మీదుగా చెన్నాయపాలెం వెళ్లే రోడ్డులో 2/4 కి.మీ వద్ద రూ.2.75 కోట్లతో వంతెన పనులు చేపడతారు.
- దుగ్గిరాల మండల పరిధిలో టీఎం రోడ్డు నుంచి ఉప్పలపాడు రోడ్డు మధ్య రూ.2.30 కోట్లతో వంతెన నిర్మాణం జరగనుంది.
- కాకుమాను మండలం పెదపాలెం–బాపట్ల పీఎస్‌పాడు ఆర్‌అండ్‌బీ రోడ్డులో 15.6 కి.మీ. వద్ద రూ.2.98 కోట్లతో వంతెన నిర్మించనున్నారు.
- కొల్లిపరలో రేపల్లె–విజయవాడ కరకట్టకు రేపల్లె మెయిన్ కెనాల్‌పై రూ.4.19 కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టనున్నారు.
- నిజాంపట్నం పరిధిలో రేపల్లె మెయిన్ డ్రెయిన్‌పై కోనపాలెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు 32.75 కి.మీ వద్ద రూ.6.40 కోట్లతో వంతెన నిర్మించనున్నారు.
- న్యూజెండ్లలో చింతలచెరువు నుంచి లింగముక్కలపల్లి మీదుగా అందుగులపాడు రోడ్డులో రూ.15.83 కోట్లతో వంతెన పనులు చేపట్టనున్నారు.
- పీవీపాలెంలో తుంగభద్ర డ్రెయిన్‌పై పిట్టలవానిపాలెం–గణపవరం రోడ్డులో రూ.9.13 కోట్లతో వంతెన నిర్మాణం జరగనుంది.
- రాజుపాలెం పరిధిలో రెడ్డిగూడెం నుంచి మొక్కపాడు మీదుగా భృగుబండ బీటీ రోడ్డులో రూ.5.66 కోట్లతో వంతెన నిర్మితం కానుంది.
- వినుకొండ పరిధిలో పువ్వాడ–కొందూరు రోడ్డులో రూ.20.15 కోట్లతో వంతెన నిర్మాణం జరగనుంది.

క్రీడా సంరంభం

- నేటి నుంచి రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలు
- ఆతిథ్యం ఇవ్వనున్న డీఎస్‌ఏ స్టేడియం



సిద్ధమవుతున్న డీఎస్ఏ స్టేడియం

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆతిథ్యం ఇచ్చేందుకు సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియం సిద్ధమైంది. ఈనెల 23 నుంచి 29 వరకు ఏడు రోజుల పాటు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అంతర్ జిల్లాల బాలబాలికల అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. 23 నుంచి 25 వరకు అండర్–14, 25 నుంచి 27 వరకు అండర్–17, 27 నుంచి 29 వరకు అండర్–19 విభాగాల్లో అథ్లెటిక్స్ పోటీలు జరగనున్నాయి. పోటీల కోసం డీఎస్ఏ స్టేడియంలో 100, 200, 400, 600 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌లు, 80 మీటర్ల హర్డిల్స్ ట్రాక్‌తోపాటు షాట్‌పుట్, జావలిన్‌త్రో, డిస్కస్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్ పోటీలకు ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారు. క్రీడాకారులు 23న ఉదయం 8 గంటల నుంచే రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. పోటీలు సాయంత్రం 4 గంటల నుంచి ప్రారంభమవుతాయి. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారు డిసెంబరు 14 నుంచి ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొంటారు. రాష్ట్రస్థాయి పోటీలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని జయప్రదం చేయాలని డెప్యూటీ డీఈఓ కె.వేణుగోపాలరావు అధికారులకు సూచించారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పల్నాడు జిల్లా కార్యదర్శి చప్పల్లి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. డెప్యూటీ డీఈఓ మాట్లాడుతూ ఇతర జిల్లాల క్రీడాకారుల కోసం అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ధాన్యో‘స్మి’

- విరగకాసిన వరికంకులు
- జిల్లాలో ఆరంభమైన నూర్పిడులు
- ఎకరాకు 35–40 బస్తాల దిగుబడులు
- మార్కెట్లో ఆశాజనకంగా ధరలు
- అన్నదాత మోములో దరహాసం



యంత్రాలతో వరి కోతలు

తెనాలి: మాగాణి రైతు మోములో దరహాసం వెల్లివిరుస్తోంది. విరగ పండిన వరి కంకులు వసిమి వర్ణంతో మెరిసిపోతూ ఒంపుసొంపులొలకబోస్తూ హొయలొలుకుతున్నాయి. ఫలితంగా అన్నదాత హృదయం ఆనందంతో ఉప్పొంగుతోంది. కోతకు సిద్ధమవుతున్న పంటకు మార్కెట్లో వినిపిస్తున్న ధర కొండంత భరోసానిస్తోంది. ఆ దిలాసాతోనే రైతులు మాగాణిలోని వరిపైరు నూర్పిడికి ఉపక్రమించారు. వాతావరణంలో మార్పుల వల్ల అక్కడక్కడా సన్నని జల్లులు పడటం కొంత భీతిని కలిగిస్తోంది.

వెదజల్లిన పొలాల్లో పక్వానికి..

గుంటూరు జిల్లాలోని మాగాణి పొలాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరిపైరు పక్వానికొచ్చింది. ముందుగా వెదజల్లిన చేలల్లో పంట చేతికొస్తోంది. గత నాలుగైదు రోజులుగా తెనాలి, పరిసరాల్లో పంట కోత యంత్రాలతో ఒకేసారి నూర్పిడి చేస్తున్నారు. ఏపుగా పెరిగిన పైరు అడపాదడపా పడుతున్న జల్లుకు అక్కడక్కడా నేలకొరిగింది. దీంతో ఆ చేలతోపాటు కోతకు సిద్ధమైన చేలల్లో యంత్రాలతో నూర్పిడి చేస్తున్నారు. జిల్లాలో మాగాణి విస్తీర్ణం 1,52,411 ఎకరాలు. ఇందులో 1,36,971 ఎకరాల్లో వరి సాగు చేశారు. 15,440 ఎకరాల్లో ఇతర పంటలు వేసుకున్నారు. వరిని ఎక్కువ శాతం వెదజల్లిన విషయం తెలిసిందే.

సత్ఫలితాలనిచ్చిన ప్రభుత్వ ప్రణాళిక

సీజన్ ఆరంభంలో వర్షాలు వెన్నాడటంతో కొన్నిచోట్ల రైతులు రెండోసారి విత్తనాలు చల్లాల్సి వచ్చింది. ఆ తర్వాత వర్షాభావ పరిస్థితులు నెలకొనటం తెలిసిందే. ఆగస్టులో సాధారణంకన్నా 62 మి.మీ. తక్కువ వర్షపాతం నమోదైంది. సెప్టెంబరులో 57 మి.మీ. ఎక్కువ వర్షం కురిసినా.. మళ్లీ అక్టోబరు నెలలో పరిస్థితి దారుణంగా మారింది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 202.3 మి.మీ.కి గాను 50 మి.మీ. మించలేదు. నవంబరులోనూ అంతంతే. దీనికితోడు పొరుగు రాష్ట్రాల్లో వర్షాలు తక్కువగా ఉండటంతో జలాశయాల్లోనూ నీరు తక్కువగా ఉంది. అయినా జిల్లాలోని ఆయకట్టుకు ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా సాగునీరు సరఫరా చేస్తూ వచ్చింది. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పులిచింతల జలాశయం నుంచి, అవసరమైనప్పుడు పట్టిసీమ నుంచి అదనంగా నీరు తీసుకుంటూ ప్రణాళికాబద్ధంగా పొలాలకు అందించింది. ఫలితంగానే వర్షాభావ పరిస్థితుల్లోనూ వరి విరగపండింది.

కలిసివస్తున్న ధర

ప్రస్తుతం 75 కిలోల వరి ధాన్యం బస్తా రూ.1,750 పలుకుతోంది. ఈ ధర పాత ధాన్యానికే అయినా, కొత్త ధాన్యానికి మంచి రేటే వస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణంలో ముసురు ఆవరించింది. మరో నెల వరుణుడు కరుణిస్తే అన్నదాతలకు అంతకు మించిన సంతోషం మరొకటి ఉండదు.

ఎకరాకు 40 బస్తాలు!

ప్రస్తుతం ఎకరాకు 35–40 బస్తాల దిగుబడి వస్తోంది. తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామం అత్తోటలో 40 బస్తాల దిగుబడి వచ్చినట్టు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు చెప్పారు. ప్రస్తుతం ముదురు వరిచేలల్లో నూర్పిడులు జరుగుతున్నాయి. మరో పదిరోజుల్లో లేత చేలు కోతకు వస్తాయి. రెండువారాల్లో ముమ్మరమవుతాయి. మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉండటం మరో విశేషం.



ధాన్యాన్ని బస్తాలో నింపుతున్న రైతులు

సంక్షేమ గళం



సొంతింటి కల సాకారం



తెనాలి పట్టణంలో 25 ఏళ్ల నుంచి నివసిస్తున్నాం. నేను జేఎంజే కళాశాలలో సిస్టర్స్ దగ్గర చిన్నచిన్న పనులు చేస్తూ ఉంటాను. నా భర్త కూలి పని చేస్తుంటాడు. మాకు ముగ్గురు ఆడపిల్లలు. ఒక కుమార్తెకు పెళ్లి చేశాం. ఇద్దరు ఇంజినీరింగ్ పూర్తి చేసి ఉద్యోగ యత్నాల్లో ఉన్నారు. 25 ఏళ్ల నుంచి ఇంటిస్థలం కోసం దరఖాస్తు చేస్తూనే ఉన్నాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత మాకు ఇళ్ళ స్థలం ఇవ్వడంతోపాటు పిల్లల చదువుకు తోడ్పాటును అందించారు. సొంత ఇంటి కలను సాకారం చేసిన సీఎం జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలి.

– దాసరి జ్యోతి, ఇళ్ళ స్థల లబ్ధిదారులు, చెంచుపేట, తెనాలి.

ఇంటి నిర్మాణం చేయించారు



నా పేరు అంజమ్మ. కాలువ కట్టపై గుడిసె వేసుకుని జీవించేవాళ్లం. గతంలో ఎన్నో ప్రభుత్వాలు స్థలం ఇస్తామని చెప్పి మోసం చేశాయి. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక మా గుడిసెలు తొలగించి పక్కా ఇళ్లు ఇస్తామన్నారు. అయితే మేం నమ్మలేదు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దగ్గరుండి మాకు ఇళ్ల స్థలం ఇవ్వడంతోపాటు నిర్మాణం పూర్తి చేయించి ఇచ్చారు. మౌలిక వసతులు కల్పించారు. ఇప్పుడు సంతోషంగా ఉన్నాం. జగనన్నకు రుణపడి ఉంటాం.

– పులి అంజమ్మ జగనన్న కాలనీ లబ్ధిదారురాలు, మంగళగిరి

పాండురంగడి ఉత్సవాలు ప్రారంభం

మచిలీపట్నంటౌన్: దేశ వ్యాప్తంగా పేరొందిన చిలకలపూడి శ్రీ పాండురంగస్వామి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం ఉదయం గోపూజ, గణపతిపూజ, విఠల్ కోటి పూజ, లక్ష్మీగణపతిహోమం తదితర పూజా కార్యక్రమాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయానికి నగర మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆలయానికి చేరుకోగా ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. అనంతరం వారు సంప్రదాయబద్ధంగా పట్టువస్త్రాలను తలపై మోస్తూ తీసుకొచ్చి స్వామివారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు ఉండాలని సూచించారు. ఆలయ నిర్వాహకుడు టేకి నరసింహం, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ శ్రీకాకోళపు రేణుకారాణి, కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

డివిజన్ మీదుగా శబరిమలకు ప్రత్యేక రైళ్లు

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని శబరిమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం గుంటూరు డివిజన్ మీదుగా ప్రత్యేక రైళ్లను కేటాయించడం జరిగిందని డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ బుధవారం వెల్లడించారు. విజయవాడ–కొట్టాయం (07137) ప్రత్యేక రైలును డిసెంబర్ 1,8,20, జనవరి 12,19వ తేదీలలో కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ రైలు విజయవాడ స్టేషన్ నుంచి రాత్రి 10.55 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు కొట్టాయం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. కొట్టాయం–విజయవాడ (07138) ప్రత్యేక రైలు డిసెంబర్ 3,10,31, జనవరి 14,21వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ రైలు కొట్టాయం నుంచి రాత్రి 1 గంటకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 2 గంటలకు విజయవాడ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలియజేశారు. ఈ రైళ్లు న్యూగుంటూరు రైల్వే స్టేషన్, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, సింగరాయకొండ, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్‌పడి, జోలార్‌పట్టి, శేలం, ఈరోడ్, తీరూపూర్, పాల్‌ఖడ్, త్రిసూర్ స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. విజయవాడ – కొట్టాయం (07139) రైలు డిసెంబర్ 15, 22, జనవరి 5వ తేదీలలో ప్రత్యేక రైలు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ రైలు విజయవాడ స్టేషన్ నుంచి సాయంత్రం 4.25 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10 గంటలకు కొట్టాయం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. కొట్టాయం – వియవాడ(07140) రైలు డిసెంబర్ 17,24, జనవరి 7వ తేదీన కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ రైలు కొట్టాయం స్టేషన్ నుంచి రాత్రి 1గంటకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 6.15 గంటలకు విజయవాడ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ రైలు గుంటూరు, నరసరావుపేట, వినుకొండ, దొనకొండ, మార్కాపూర్‌రోడ్డు, కంభం, గిద్దలూరు, నంద్యాల, బనగానపల్లి, మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. శబరిమల వెళ్లే భక్తులు సురక్షితమైన ప్రయాణం చేయాల్సిందిగా తెలిపారు.

రైల్వే సిగ్నల్ కేబుల్ దొంగిలిస్తున్న ఇద్దరు అరెస్టు

చీరాల అర్బన్: రైల్వే సిగ్నల్ కేబుల్ దొంగిలించి ఆటోలో తరలించేందుకు ప్రయత్నిస్తున్న ఇద్దరిని బుధవారం చీరాల ఆర్పీఎఫ్ సీఐ వి.శ్రీనివాసరావు అరెస్టు చేశారు. స్టువర్టుపురానికి చెందిన ఎ.విల్సన్‌బాబు, చీరాల ఊజిలిపేటకు చెందిన ఎస్.అర్జున్ ఆటో డ్రైవర్లుగా ఉన్నారు. బుధవారం మధ్యాహ్నం స్టువర్టుపురం రైల్వేస్టేషన్ సమీపంలో సిగ్నల్స్‌కు వినియోగించేందుకు పక్కన ఉంచిన 25 మీటర్ల కేబుల్ వైర్‌ను తరలించేందుకు ఆటోలో ప్రయత్నిస్తుండగా, ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ ఎం.రాజన్న, కానిస్టేబుల్ పి.శ్రీనివాసరెడ్డి గమనించారు. వారిని విచారించగా, కేబుల్ వైర్‌లోని ఇనుమును అమ్ముకునేందుకు తీసుకెళుతున్నట్లు అంగీకరించారు. ఆటోను సీజ్ చేసి, ఇద్దరిపై కేసు నమోదు చేసి నెల్లూరు రైల్వే కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఆర్పీఎఫ్ పోలీసులు తెలిపారు. సిగ్నల్ కేబుల్ విలువ సుమారు రూ.20వేలు వరకు ఉంటుందని చెప్పారు.

క్రీడలతో సమాజానికి గొప్ప సందేశం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఆర్‌కే రోజా, హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జి తదితరులు

- నిరంతరం తీరికలేకుండా గడిపే వైద్యులు క్రీడాపోటీల్లో పాల్గొనడం అభినందనీయం
- బ్యాంకు బ్యాలెన్స్ కంటే ఆరోగ్యం ఎంతో ముఖ్యం
- క్రీడారంగానికి ఏపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం
- మంత్రి ఆర్‌కే రోజా
- ఐఎంఏ ఆధ్వర్యంలో డాక్టర్స్ ఒలింపియాడ్–2023 ప్రారంభం

ఏఎన్‌యూ: నిరంతరం తీరికలేకుండా ఉండే డాక్టర్లు క్రీడాపోటీల్లో పాల్గొనడం సమాజానికి గొప్ప సందేశమని ఏపీ టూరిజం, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ స్థాయి డాక్టర్స్ ఒలింపియాడ్ – 2023 ప్రారంభోత్సవ సభ బుధవారం రాత్రి జరిగింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న ఐఎంఏ క్రీడా మైదానంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి రోజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ డాక్టర్లు క్రీడలకు ఇంత ప్రాధాన్యతనివ్వడం అభినందించదగ్గ పరిణామమన్నారు. డాక్టర్ల క్రీడల్లో జయాపజయాలకంటే వారు క్రీడలు ఆడుతున్నారనేది ఆదర్శనీయమన్నారు. కోవిడ్ సమయంలో, ఏపీ ప్రభుత్వం నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలోను డాక్టర్లు ఎంతో అంకితభావంతో విధులు నిర్వహించారన్నారు. విజయవాడ డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జీ ప్రసంగిస్తూ తమ యూనివర్సిటీ వైద్య విద్యతోపాటు క్రీడారంగానికి కూడా అత్యధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ప్రతి ఏటా రూ. 2కోట్లు వెచ్చించి క్రీడాపోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మెడికల్ డిగ్రీ పూర్తి చేసిన ప్రతి డాక్టర్ వెంటనే ఐఎంఏలో సభ్యుత్వం తీసుకోవాలని సూచించారు. ఐఎంఏకి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శరద్ కుమార్ అగర్వాల్, కార్యదర్శి డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ సాంబశివారెడ్డి, ఐఎంఏ ఏపీ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ జి.రవికృష్ణ, డాక్టర్ ఫణిధర్, ఐఎంఏ మాజీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ సమరం, జాతీయ ఫైనాన్స్ కార్యదర్శి బాలి, ఉపాధ్యక్షుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. పోటీలలో 19 రాష్ట్రాల నుంచి డాక్టర్లు పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు.

నిబంధనల ప్రకారమే సవరణలు ఉండాలి

జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: జిల్లాలోని ఎస్ఎస్ఆర్–2024 డ్రాఫ్ట్ జాబితాకు సంబంధించి వచ్చిన అభ్యంతరాలను, క్లెయిమ్స్‌ను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాప్రతినిధులు, అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటర్ల జాబితాలో ఫోటో సిమిలర్ ఎంట్రీలు, డెమోగ్రాఫికల్ సిమిలర్ ఎంట్రీలు, డూప్లికేట్ ఓటర్ల వివరాలు క్షేత్ర స్థాయిలో పరిశీలించాలన్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఓటర్ల లిస్టుల్లో జీరో డోర్ నెంబర్ లేకుండా పూర్తిస్థాయి సవరణ చేయాలని చెప్పారు. ఓటర్ల వెరిఫికేషన్‌కు బీఎల్ఓలు ఖచ్చితంగా వెళ్లాలన్నారు. పరిశీలించిన క్లెయిమ్స్‌ను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్ఓ చంద్రశేఖరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఎ.అరవిందరావు, లక్ష్మీకుమారి, గుంటూరు ఆర్డీఓ పి.శ్రీకర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైల్వే పెన్షనర్స్ సమీక్షా సమావేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ డివిజనల్ సెక్రటరీ రాఘవబాబు, పక్కన సభ్యులు

లక్ష్మీపురం: ఢిల్లీలోని రైల్వే భారత్ పెన్షనర్స్ సమాజ్ వారి 68వ ఏజీఎం సమావేశంలో పాల్గొని పెన్షనర్స్ సమస్యల గురించి సమగ్రంగా చర్చించడం జరిగిందని గుంటూరు రైల్వే డివిజనల్ సెక్రటరీ రాఘవబాబు అన్నారు. స్థానిక గుంటూరు అరండల్‌పేటలోని రైల్వే గుంటూరు డివిజనల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో రైల్వే బోర్డు చైర్మన్ జయవర్మసిన్హా, అడిషినల్ రైల్వే బోర్డు సభ్యురాలు వి.జి.భూమాలను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందజేయడం జరిగిందన్నారు. తాము అందించిన వినతి పత్రంలో ప్రధానంగా సీజీహెచ్ రేట్లు పెంచాలని, దాని వల్ల రిఫరల్ హాస్పిటల్ వారు పేషెంట్స్ వద్ద డబ్బులు వసూలు చేయడం ఉండదని చెప్పడం జరిగిందన్నారు. అదే విధంగా రైల్వే పెన్షనర్స్‌కు ఆఫీసు వసతి ఏర్పాటు చేయాలని, రిఫరల్ హాస్పిటల్‌లో గదులను మంజూరు చేయాలని, దానిని రైల్వే బోర్డు ఆర్డర్ ద్వారా అన్ని జోన్స్‌కు తెలియపరచాలని కోరామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే పెన్షనర్స్‌కు హెల్త్ ఇన్స్యూరెన్స్ గురించి అవగాహన కల్పించి, రిఫరల్ హాస్పిటల్ దగ్గరలో ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇంకా మరికొన్ని సమస్యలపై వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు. పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నారాయణరెడ్డి, కోటేశ్వరరావు, నరసింహారావు, మౌలాలీ, ఆదినారాయణరెడ్డి, నాంచారయ్య, మల్లికార్జునరావు, మూర్తి, శాస్త్రి, సత్యానారాయణ పాల్గొన్నారు.

టాటా షోరూమ్ జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రారంభం



షోరూమ్‌లో ఉన్న టాటా కారుతో జిల్లా కలెక్టర్ శివశంకర్, షోరూమ్ ప్రతినిధులు

నరసరావుపేట: స్థానిక వినుకొండ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన టాటా మోటార్స్ వారి జాస్పర్ ఇండస్ట్రీస్ ప్యాసింజర్ కార్ల సేల్స్ అండ్ సర్వీసెస్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి పూజలు చేశారు. షోరూమ్‌లో ఉంచి టాటా నెక్సన్ కారులో కూర్చొని దాని ఫ్యూచర్లను పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏడాది క్రితం నూతనంగా ఏర్పడిన పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు టాటా మోటార్ షోరూమ్ రావటం హర్షణీయమని చెప్పారు. టాటా వాహనాలన్ని మధ్యతరగతి వర్గీయులకు అందుబాటులో ఉంటాయన్నారు. దీనిని జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ సీహెచ్ సత్యనారాయణ, సర్వీసు మేనేజర్ పఠాన్ పాల్గొన్నారు.

పల్నాడులో 32.2 మిల్లీమీటర్ల వర్షం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో 32.2 మిల్లీ మీటర్ల వర్షం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు బుధవారం తెలిపారు. మొత్తం 28 మండలాలకు గాను తొమ్మిది మండలాల్లో వర్షం పడిందన్నారు. మంగళవారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం వరకు సత్తెనపల్లిలో 1.2 మి.మీ., వినుకొండలో 6.2, నూజెండ్లలో 12.6, శావల్యాపురం 0.4, ఈపూరులో 3.4, రొంపిచర్లలో 4.0, నరసరావుపేట, చిలకలూరిపేటల్లో 1.4, యడ్లపాడులో 1.6 మి.మీ. వర్షం కురిసింది.

26న ఎన్ఎంఎంఎస్ మోడల్ టెస్ట్

బాపట్ల అర్బన్: ఎనిమిదో తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) మోడల్ పరీక్షను ఈ నెల 26న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు ఏపీ స్కూల్ అసిస్టెంట్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా జనరల్ సెక్రటరీ సీహెచ్.టి.వి.సురేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్ని మండల కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. డిసెంబర్ 3న జాతీయ ఉపకార వేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు హాజరవుతున్న విద్యార్థులకు ఈ మోడల్ పరీక్ష ఎంతగానో ఉపయోగపడుతోందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్ వరకు కేంద్రం మెరిట్ స్కాలర్ షిప్ మంజూరు చేస్తుందని తెలియజేశారు. వివరాలకు కె. పిచ్చయ్యను 98498 98808 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఎన్నికల నిబంధనలు పారదర్శకంగా అమలు


జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

శావల్యాపురం: ఎన్నికల కమిషన్ నిబంధనలను రెవెన్యూ అధికారులు పారదర్శకంగా అమలు చేస్తున్నారని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని బుధవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జేసీ మాట్లాడుతూ ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఆధారాలతో బీఎల్ఓలకు అందజేస్తే సత్వరమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. జిల్లాలో భూముల రీసర్వే పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. 3 లక్షల 60 వేల ఎకరాలు ఉండగా 3 లక్షల 30 వేల ఎకరాలు రీసర్వే పూర్తి అయినట్లు చెప్పారు. భూహక్కు పత్రాలు మంజూరు చేశామన్నారు. జిల్లాలో మూడో విడత రీసర్వే పనుల్లో భాగంగా వంద రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేయగా ఇందుకుగాను 70 గ్రామాల్లో పూర్తి చేశామన్నారు. రీసర్వే పనుల్లో అభ్యంతరాలు ఉన్న రైతులు ఆధారాలతో అధికారులు అందజేస్తే మొబైల్ మేజిస్ట్రేట్ సమక్షంలో సమస్య పరిష్కారించనున్నట్లు పేర్కొన్నారు. ఆయనతో పాటు తహసీల్దారు షేక్ జాన్‌సైదులు, డెప్యూటీ తహసీల్దార్లు వేముల వెంకట నాగరాజు, పి.నాసరయ్య, డెప్యూటీ సర్వేయర్ నాగేశ్వరరావు ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి శిక్ష

పట్నంబజారు: వృద్ధురాలిపై అత్యాచారం, దాడి చేసి హత్య చేసిన నిందితుడికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించడంతోపాటు, జరిమానా విధిస్తూ ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి నీలిమా తీర్పు వెలువరించారు. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 2022లో లాలాపేట పోలీసు స్టేషన్ పరిధిలోని మూర్తిఫ్యాషన్స్ వీధిలో నివాసం ఉంటున్న వృద్ధురాలిని నల్లచెరువుకు చెందిన తాతిపోతుల శివశంకర్ వృద్ధురాలు ఒంటరిగా ఉన్న సమయంలో ఆమె నివాసంలోకి వెళ్లి అత్యాచారం చేసి, అనంతరం హత్య చేసి పలు వస్తువులు దోచుకుని పరారయ్యాడు. ఈమేరకు కేసు నమోదుచేసిన లాలాపేట పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా నిందితుడిని 24 గంటల్లోపు అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం పూర్తిస్థాయిలో నేరానికి సంబంధించి తీర్పు తెలియజేస్తూ చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ వాదనల అనంతరం బుధవారం పూర్తిస్థాయి దర్యాప్తు అనంతరం సంబంధిత దర్యాప్తు పత్రాలు కోర్టుకు సమర్పించారు. శివశంకర్ నేరం చేసినట్లు రుజువు కావడంతో ఐదో అదనపు జిల్లా న్యాయమూర్తి నీలిమా నిందితుడికి పది సంవత్సరాల జైలు శిక్ష, రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పోలీసుల తరఫున వెంకట్ రెడ్డి, శ్రీక్రాంత్ వాదనలు వినిపించారు. లాలాపేట పోలీసులు సకాలంలో సాక్షులను కోర్టులో హాజరు పరిచారు.

ఏపీటీఎఫ్ బలోపేతానికి కృషి చేయాలి



నూతనంగా ఎన్నికైన వారితో ఏపీటీఎఫ్ కార్యవర్గం


యడ్లపాడు: పాఠశాలల అభివృద్ధితో పాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి సంఘటితంగా కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) పల్నాడు జిల్లా అధ్యక్షులు బెజ్జం సంపత్‌బాబు కోరారు. సంఘం సర్వసభ్య సమావేశం మండల కేంద్రమైన యడ్లపాడు లూథరన్ హైస్కూల్లో బుధవారం నిర్వహించారు. సంఘం రాష్ట్ర నాయకులు భూపతి విజయానంద ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం సభ్యుల ఎంపికలో పల్నాడు జిల్లా అసోసియేట్ అధ్యక్షుడిగా మద్దు ప్రసన్నకుమార్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎస్.శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షులు సంపత్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు పమ్మి వెంకటరెడ్డి, మహిళా నాయకులు సుగంధ పద్మలత, ఎం.హేమలత, జ్యోతిర్మయి, పి.విజయ్, కె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

* సందర్భం

గతంలో ఎం.ఎల్.ఏ అయిన ఒక పెద్ద హీరో స్త్రీల గురించి అసభ్యంగా మాట్లాడి అసెంబ్లీలో సంజాయిషీ ఇచ్చాడు.
డెబ్బయి ఏళ్లు దాటిన ఒక సీనియర్ నటుడు నోరు పారేసుకుని పరువు పోగొట్టుకున్నాడు.
పార్లమెంట్ సభ్యుడుగా ఉన్న మరో నటుడు స్త్రీల దుస్తుల గురించి సుద్దులు చెప్పి నిరసన ఎదుర్కొన్నాడు.
ఇప్పుడు తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్.
సెలబ్రిటీలుగా ఉన్నవారు ఎంతో బాధ్యతగా ఉండి యువతకు మార్గం చూపేలా ఉండాలి.
వారు ఇలా తగలడితే స్త్రీలతో ఎలా వ్యవహరించాలో ఇంటినే బడిగా మార్చి తల్లిదండ్రులు నేర్పించాల్సి ఉంటుంది.
అయితే ఇంటి ఆడవారికి తండ్రి, భర్త గౌరవం ఇచ్చి మాట్లాడుతున్నారా అనేది ప్రశ్న.

మగవారూ... భాష జాగ్రత్త


త్రిష


మన్సూర్ అలీఖాన్

అతడో ప్రసిద్ధ నటుడు. 'మా బ్లడ్డు వేరు మా బ్రీడు వేరు' అంటుంటాడు. కాని ఒక సభలో అభిమానులను చూసి పూనకం వచ్చి స్త్రీల గురించి అశ్లీలమైన వ్యాఖ్యలు చేశాడు. వందల సినిమాల్లో తండ్రిగానో బాబాయిగానో వేసిన ఒక నటుడు 'స్త్రీల మీద మీ అభిప్రాయం ఏమిటి?' అని సభలో యాంకర్ అడిగితే పరమ రోతగా సమాధానం ఇచ్చాడు. ఇక నటుడుగా, రియల్టర్‌గా గుర్తింపు పొందిన మరో పెద్ద మనిషి పార్లమెంట్ మెంబర్ అయ్యాక పార్లమెంట్‌లో నిలబడి మరీ 'స్త్రీల దుస్తుల వల్లే వారికి సమస్యలు వస్తున్నాయి' అన్నాడు.

స్త్రీలను ఏదో ఒకటి అనేయొచ్చు, అంటే వాళ్లు పడతారు, అనడానికే మేము పుట్టాము అనే చులకనభావం పురుష సమాజంలో నరనరాన జీర్ణించుకుని పోబట్టే ఈ ప్రతిఫలాలు. అదృష్టవశాత్తు ఇలాంటి వ్యాఖ్యలకు వెంటనే నిరసన పెల్లుబుకుతున్నా పురుషుల నోటి దురుసు తగ్గడం లేదు. తాజాగా తమిళ నటుడు మన్సూర్ అలీఖాన్ ఇటీవల త్రిషతో 'లియో' సినిమాలో నటించిన సందర్భాన్ని గుర్తు చేసుకుంటూ 'ఆమె హీరోయిన్ అని తెలిశాక (గత సినిమాల్లో తాను చేసిన) బెడ్‌రూమ్ సీన్ ఉంటుందని ఆశపడ్డాను' అని వ్యాఖ్యానించాడు. 'ఇది సినిమా లాంగ్వేజ్' అని మన్సూర్ అనుకుని ఉండొచ్చుగాని దానిలోని అశ్లీల ధ్వనికి త్రిష రియాక్ట్ అయ్యింది. 'ఇతనితో ఇంకెప్పుడూ సినిమాల్లో నటించను' అని చెప్పింది. ఆ తర్వాత చినికి చినికి గాలివానై ఇప్పుడు మన్సూర్ మీద కేసు బుక్ అయ్యేంతగా వెళ్లింది. మగవాళ్లు 'సరదాగా మాట్లాడుతున్నామని' అనుకుంటూ కూడా స్త్రీలను కించపరిచే వ్యాఖ్యలు చేస్తారు. సరదాగా కించపరచడం ఏమిటో... కించపరచడం ఎలాంటి సరదానో వీరే చెప్పాలి.

ప్రసిద్ధులే దారి తప్పితే

రాజకీయ నేతలు, సినిమా నటులు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు... ఇలా సమాజంలో గుర్తింపు పొందినవారు స్త్రీల పట్ల మరింత గౌరవంతో మెలగుతూ ఆదర్శంగా నిలవాలి. కాని చాలాసార్లు రాజకీయ నాయకుల దగ్గరి నుంచి అన్ని రకాల ప్రముఖులు ఏదో ఒక సందర్భంలో చులకన మాటలు మాట్లాడుతూ కుసంస్కారాన్ని ప్రదర్శిస్తున్నారు. ఉత్తరాదిలో మంత్రులు 'మేం వేసిన రోడ్లు ఫలానా హీరోయిన్ బుగ్గల్లా ఉంటాయి' అంటూ వదరుతుంటారు. సల్మాన్ ఖాన్ 'సుల్తాన్' సినిమాలో కుస్తీ వీరుడిగా నటించి 'ఈ సినిమాలో కుస్తీలు చేస్తే రేప్ జరిగినంత పనయ్యింది నాకు' అని వ్యాఖ్యానించి మొట్టికాయలు తిన్నాడు. ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ఒక మాజీ మంత్రి ప్రస్తుత మంత్రిగా ఉన్న నటిపై దారుణమైన వ్యాఖ్యలు చేసి కోర్టు కేసును ఎదుర్కొనబోతున్నాడు.

బాల్యం నుంచి భావజాల ప్రభావం

'కుటుంబంలో తండ్రి (మగాడు) ముఖ్యం' అనే భావన బాల్యం నుంచి పిల్లల్లో ఎక్కించడం ద్వారా పురుష సమాజం తన ఆధిక్యతను స్త్రీలపై ఆధిపత్యాన్ని కొనసాగించేలా చేస్తుంది. తండ్రిని 'మీరు' అని, తల్లిని 'నువ్వు' అని అనడంలో ప్రేమ, గౌరవం, దగ్గరితనం ఉన్నా 'నువ్వు' అనడం వల్ల 'లెక్క చేయవలసిన పని లేదు' అనే భావన కలిగితే కష్టం. తిట్లు, బూతులు అన్నీ స్త్రీలను అవమానించేవే. వాటిని విని, పలికి స్త్రీల పట్ల అలా మాట్లాడవచ్చు అనుకుంటారు మగవారు. ఇంట్లో చెల్లెని, అక్కని, తల్లిని తండ్రి అదుపు చేసే తీరు చూసి, తామూ బయట స్త్రీలను అలాగే అదుపు చేయవచ్చనుకుంటారు. ఫైటర్ జెట్స్‌ను స్త్రీలు నడుపుతున్న ఈ కాలంలో కూడా 'మేమేమీ గాజులు తొడుక్కోలేదు', 'మూతి మీద మీసముంటే రా'లాంటి పౌరుష వచనాలను పురుషులు ఇంకా పలికేటంత వెనుకబాటుతనంలో ఉండటం విషాదకరం. శారీరక పరిమితులు ఉన్నంత మాత్రాన స్త్రీలు బలహీనులు, పురుషులు బలవంతులు కాబోరు.

తల్లిదండ్రులూ జాగ్రత్త

అబ్బాయిలను ఆడపిల్లలను గౌరవించేలా పెంచడం, టీనేజ్‌లో ఉన్న అబ్బాయిలకు సరైన కౌన్సెలింగ్ ఇవ్వడం ఇప్పటి తల్లిదండ్రుల తక్షణ కర్తవ్యం. చట్టాలు పకడ్బందీగా ఉన్న ప్రస్తుత రోజుల్లో తెలిసో తెలియకో అహంకారంతోనో పరుష వ్యాఖ్య, అసభ్య చేష్ట నేరుగా కాని సోషల్ మీడియాలోగాని చేస్తే వారు ప్రమాదంలో పడతారని హెచ్చరించాలి. చైతన్యం పెరిగింది. అబ్బాయిలూ భాష జాగ్రత్త.

న్యూస్ మేకర్

ఫైనల్ మ్యాచ్‌లో మన జట్టు ఓటమి చెందిన బాధలో ఆమె పెద్దగా ఎవరికంటా పడలేదుగానీ...
ఆ తరువాత మాత్రం 'ఎవరీ అమ్మాయి?' అనుకున్నారు చాలామంది.
గెలుపు తరువాత ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు పక్కన ప్రముఖంగా కనిపించిన ఆ అమ్మాయి పేరు...
ఊర్మిళా రోసారియో. ఎవరీ ఊర్మిళ?

అవును... మన అమ్మాయే!




తల్లిదండ్రులతో ఊర్మిళ


వన్స్ అపాన్ ఏ టైమ్... కుటుంబ సభ్యులతో... (కింది వరసలో మధ్యలో)

ఊర్మిళా రోసారియో ఆస్ట్రేలియన్ క్రికెట్ టీమ్ మేనేజర్. ఆమె తల్లిదండ్రులు ఐవీ, వాలెంటైన్ రోసారియోలది కర్ణాటకలోని మంగళూరుకు సమీపంలోని కిన్నిగోలి ప్రాంతం. ఐవీ, వాలంటైన్‌లు ఖతార్‌లోని దోహాలో ఉద్యోగం చేస్తున్న కాలంలో ఊర్మిళ జన్మించింది.

ఊర్మిళకు చిన్నప్పటి నుంచి ఆటలు అంటే చాలా ఇష్టం. స్కూలు రోజుల్లో క్రికెట్ కంటే బాస్కెట్‌బాల్, టెన్నిస్ బాగా ఆడేది. బంగీ జంపింగ్ అంటే ఇష్టం. ఖతార్ టెన్నిస్ ఫెడరేషన్‌లో మూడు సంవత్సరాలు పనిచేసింది.

కార్నెగీ మెలన్ యూనివర్శిటీలో బీబీఏ చేసిన ఊర్మిళ ఆ తరువాత ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టుకు మేనేజర్‌గా పనిచేసింది. ఒక నాన్-ఆస్ట్రేలియన్‌కు టీమ్ మేనేజర్ బాధ్యతలు అప్పగించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఫుట్‌బాల్ ప్రపంచకప్ నేపథ్యంలో క్రికెట్ నుంచి కొన్ని నెలల పాటు విరామం తీసుకొని ఖతార్‌లో ఫుట్‌బాల్ స్టేడియం నిర్వాహణ బాధ్యతలు చూసుకుంది.

ఆ తరువాత మళ్లీ ఆస్ట్రేలియాకు వచ్చింది.

ఆస్ట్రేలియా మహిళా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఊర్మిళ పనితీరు, హిందీ, కన్నడ, కొంకణి... మొదలైన భారతీయ భాషలలో నైపుణ్యం వరల్డ్‌కప్ టూర్‌లో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు మేనేజర్‌గా ఎంపిక చేయడానికి కారణం అయింది.

ఏడు సంవత్సరాల క్రితం ఊర్మిళ తల్లిదండ్రులు దోహా నుంచి మన దేశానికి వచ్చారు. కాఫీ ఎస్టేట్ కొనుగోలు చేసి కర్ణాటకలోని సకలేష్‌పూర్‌లో స్థిరపడ్డారు.

'క్రికెట్‌తో ఒకప్పుడు నాకు పెద్దగా పరిచయం లేదు. అలాంటి నాకు క్రికెట్‌తో ఇంత అనుబంధం ఏర్పడడం ఆశ్చర్యంగా ఉంది' అని నవ్వుతూ అంటుంది ఊర్మిల.

నవ్వడం సరే,
క్రికెట్ టీమ్ మేనేజర్ అంటే మాటలా?

ఒక్కమాటలో
చెప్పాలంటే...
'రెస్పాన్సిబుల్ ఫర్ ఎవ్రీథింగ్'
దీనిలో వందకు వంద మార్కులు కొట్టేసింది ఊర్మిళ.

ఊర్మిళ గత మార్చిలో తల్లిదండ్రులను చూడడానికి మనదేశానికి వచ్చింది. ఊర్మిళ ఇక్కడ ఉంటే కాఫీ ఎస్టేట్‌లో చిన్న చిన్న పనులు కూడా చేస్తుంది. ఆమె పక్కన ఉంటే తల్లిదండ్రులకు పండగే. కూతురి ఉన్నతి గురించి పెద్దగా మాట్లాడకపోయినా 'ఫైనల్ మ్యాచ్ చూడడానికి అహ్మదాబాద్‌కు వెళ్లాలనుకున్నాం. దురదృష్టవశాత్తు మా ఎస్టేట్ దాటి వెళ్లలేకపోయాం' అంటున్నారు ఊర్మిళ తల్లిదండ్రులు.

ఫైనల్ మ్యాచ్ మిస్ అయితే ఏమిటి?
ఏదో ఒకరోజు కాఫీ ఎస్టేట్‌కు ఊర్మిళ వస్తుంది కదా!
ఆ మ్యాచ్‌ను కళ్లకు కడుతుంది కదా! ఇక దిగులెందుకు!!

ఈ వెడ్డూరం చూశారా!

వెడ్డింగ్ విత్ టికెట్!

కొంతమంది ఎంతోఘనంగా జరుపుకునే తమ పెళ్లి వేడుకల వీడియోలను అమ్ముకుంటూ డబ్బులు సంపాదించడం ఇప్పటి ట్రెండ్‌గా మారింది. ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు తమ పెళ్లి వీడియోలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. వీరిలానే సెలబ్రిటీ హోదాలేని వారు సైతం విదేశీయులకు పెళ్లి టికెట్లు అమ్మి వెడ్డింగ్ పర్యాటకానికి తలుపులు తెరుస్తున్నారు.

భారతదేశ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. అందుకే చాలా మంది విదేశీయులు ఇక్కడి సంస్కృతిని తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తుంటారు. విదేశాలతో పోలిస్తే ఇండియాలో ఎంతో శాస్త్రోక్తంగా పెళ్లిళ్లు జరుగుతాయి. ఈ పెళ్లిళ్లను చూసేందుకు విదేశీయులు చాలా ఉత్సాహం చూపుతారు. పెళ్లి సంప్రదాయాలు, రకరకాల రుచికరమైన వంటకాలను టేస్ట్ చేసేందుకు తహ తహలాడుతుంటారు. అందుకే ఏ మాత్రం అవకాశం చిక్కినా వెంటనే వచ్చి ఇండియాలో వాలిపోతుంటారు. ఇందుకు ఎంత డబ్బు ఖర్చు పెట్టడానికైనా వెనుకాడరు. ఈ అభిరుచినే మన భారతీయ జంటలు, వెడ్డింగ్ ప్లానర్స్ సొమ్ము చేసుకుంటున్నారు. దీనికోసం ప్రత్యేకంగా వెబ్‌సైట్లు నడుపుతున్నారు. వెడ్డింగ్ ఇన్విటేషన్‌ను టికెట్‌గా చూపిస్తూ నిశ్చితార్థం నుంచి, మెహందీ, సంగీత్, హల్దీ ఇలా ఒక్కో వేడుకకి ఒక్కో రేటుని చెబుతూ పర్యాటకులను ఆకర్షిస్తున్నారని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.



జాయిన్ మై వెడ్డింగ్...

పెళ్లి చేసుకునే జంట సొంతంగా జాయిన్ మై వెడ్డింగ్ పేరుతో అకౌంట్‌ను క్రియేట్ చేస్తారు. ఈ వెబ్‌సైట్‌లో పెళ్లికొడుకు, పెళ్లికూతురు ఇద్దరి ఫోటోలు, పెళ్లి తేదీ, ఎన్నిరోజులు వేడుకలు జరుగుతాయి.. ఏ రోజు ఏ కార్యక్రమాలు నిర్వహిస్తారు... వంటి వివరాలను అప్‌లోడ్ చేస్తారు. పెళ్లిలో పెట్టే భోజనం వెజ్, నాన్‌వెజ్, మందు, చిందు ఉంటే అదీ చెబుతారు. ఇవేగాక డ్రెస్ కోడ్, అక్కడ మాట్లాడే భాష, వేడుక జరిగే ప్రదేశం అడ్రెస్‌తోపాటు ఫోన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ నంబర్‌ను ఇస్తారు. విదేశీ పర్యటనలో ఉన్న వారికి ఈ పెళ్లి తేదీలు జత కుదిరితే టికెట్స్ బుక్ చేసుకుని వచ్చేసి మరీ పెళ్లి బ్యాండ్ బాజా, బారాత్‌లను ఎంజాయ్ చేస్తున్నారు.

ఒక్కరోజుకి పన్నెండు వేలపైనే...

ఎంతో ఆడంబరంగా జరిగే మన వివాహ వేడుకలను చూడడానికి పర్యాటకులు రోజు కోసం 150 డాలర్ల టికెట్‌ను సంతోషంగా కొనేస్తున్నారు. మన రూపాయలలో పన్నెండు వేలకు పైనే. ఇక పెళ్లి పూర్తి తతంగం మొత్తం అంటే రెండు రోజులు చూడాలంటే 250 డాలర్లు చెల్లించాలి (రూ.20 వేలకుపైన). ఒకటీ, రెండూ కాదు ఐదు రోజుల పెళ్లి చూడాలంటే ప్రత్యేక వెడ్డింగ్ ప్యాకేజీ టికెట్ కొనాల్సిందే. ఇలా పదిమంది విదేశీ అతిథులు పెళ్లికి వచ్చారంటే పెళ్లిలో కొన్ని ఖర్చులకు సరిపడా డబ్బు సమకూడినట్లే! అందుకే ఎక్కువ మంది వెడ్డింగ్ టూరిజంపైన ఆసక్తి కనబరుస్తున్నారు.

తొలిసారి...

హంగేరియన్- ఆస్ట్రేలియన్ సంతతికి చెందిన ఒర్సి పర్కాణి తొలిసారి 2016లో 'జాయిన్ మై వెడ్డింగ్' పేరిట వెబ్‌సైట్‌ను క్రియేట్ చేసింది. అప్పుడు ఇది ఒక చిన్న స్టార్టప్. కానీ ఇప్పుడు ఇది ట్రెండ్‌గా మారింది. ఈ ఏడాది ఆగస్టు 19న పర్యాటక మంత్రిత్వ శాఖ వెడ్డింగ్ టూరిజంను ప్రారంభించింది. వెడ్డింగ్ టూరిజం ద్వారా భారతీయులేగాక, విదేశీయులు సైతం ఇక్కడికి వచ్చి ఇక్కడి సంప్రదాయాలకు తగ్గట్టుగా పెళ్లి వేడుకలు జరుపుకోవచ్చని చెబుతూ వెడ్డింగ్ టూరిజాన్ని ప్రోత్సహిస్తోంది. బీచ్ వెడ్డింగ్, నేచర్ వెడ్డింగ్, రాయల్ వెడ్డింగ్, హిమాలయన్ వెడ్డింగ్ థీమ్‌ల పేరిట ప్రచారం నిర్వహిస్తోంది. ఈ ట్రెండ్‌కు మంత్రిత్వ శాఖ ప్రోత్సాహం బూస్టర్‌గా పనిచేసి ఇండియాలో వెడ్డింగ్ వ్యాపారం వృద్ధిలోకి రాబోతుంది. ఇంకెందుకాలస్యం... మీ ఇంట్లో జరిగే పెళ్లివేడుకలకు వెడ్డింగ్ టూరిజంను జోడించి మరింత కలర్‌ఫుల్‌గా జరుపుకోండి.

సెర్మనీ గైడ్...

విదేశీయులను పెళ్లికి పిలవడమేగాక, వారికి అతిథి మర్యాదల్లో లోటు లేకుండా చూసుకోవడం ఈ వెడ్డింగ్ టూరిజం ప్రత్యేకత. వేడుక లో జరిగే ప్రతి విషయం, పర్యాటకులకు వచ్చే సందేహాలు నివృత్తి చేసేందుకు సెర్మనీ గైడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు." ప్రస్తుతం రాజస్థాన్, ఢిల్లీ, ముంబైలలో ఈ వెడ్డింగ్ టూరిజం పెరుగుతోంది. రాజస్థాన్‌లోని చిన్నటౌన్లలో జరిగే వేడుకలకు విదేశీయులు ఆసక్తి చూపుతున్నారు. జోధ్‌పూర్, జైపూర్, జైసల్మేర్, ఉదయ్‌పూర్‌లలో జరిగే రాయల్ ఇండియన్ వెడ్డింగ్స్‌కు డిమాండ్ ఇంకా ఎక్కువగా ఉంది" అని వెడ్డింగ్ ప్లానర్స్ చెబుతున్నారు.

బ్యూటిప్స్

ముడతలు మచ్చలు పోవాల్సిందే...



కళ్లకింద ఏర్పడిన నల్లటి వలయాలు, ముడతలు, మచ్చలు అందమైన ముఖారవిందాన్ని పాడుచేస్తాయి. ఈ చిట్కాలు పాటిస్తే మీ సమస్యకు పరిష్కారం దొరికినట్లే...



- రాత్రి పడుకునేముందు కొద్దిగా అలోవెరా జెల్‌ను తీసుకుని కళ్ల కింద రాసి మర్దన చేసి పడుకోవాలి. ఉదయాన్నే నీటితో కడిగేయాలి.



- విటమిన్ ఇ ఆయిల్ కొల్లాజెన్ బూస్టర్‌గా పనిచేసి కళ్లకింద రక్తప్రసరణ చక్కగా జరిగేందుకు తోడ్పడుతుంది. రాత్రి పడుకునే ముందు విటమిన్ ఇ ఆయిల్‌ను కళ్లకింద రాసి మర్దన చేయాలి.
- పై రెండూ అందుబాటులో లేని వారు కనీసం కొబ్బరి నూనెను అయినా



కళ్లకింద రాసుకుని మర్దన చేసుకోవాలి. ఉదయాన్నే కడిగేయాలి. ఈ మూడింటిలో ఏ ఒక్క చిట్కానైనా క్రమం తప్పకుండా పాటిస్తే కొద్దిరోజుల్లోనే ముడతలు, మచ్చలు పోయి ముఖారవిందం బాగుంటుంది.

గెలుపు దారి

వ్యాపారానికి సంబంధించిన ఐడియాలు ఏకాంతంగా కూర్చొని ఆలోచిస్తేనే వస్తాయి... అనే గ్యారెంటీ లేదు.
వ్యాపార విజయాలు ఫలానా వయసుకు మాత్రమే పరిమితం... అనే నియమాలేవీ లేవు.
నగలు అంటే బంగారమే... అనే శాసనం ఏదీ లేదు.
ఇందుకు ఉదాహరణ ముంబైకి చెందిన హేమా సర్దా...

వెదురు నగల వెలుగుల్లో...

కొన్ని సంవత్సరాల క్రితం...

దిల్లీలో జరిగిన హస్తకళల ప్రదర్శనకు హాజరైంది హేమా సర్దా. వినూత్నంగా కనిపించిన అస్సామీ బ్యాంబూ జ్యువెలరీని కొనుగోలు చేసింది. ఈ వెదురు నగలు తనకు ఎంతగా నచ్చాయంటే 65 సంవత్సరాల వయసులో 'బ్యాంబు అండ్ బంచ్' రూపంలో డైరెక్ట్-టు-కన్జ్యూమర్(డీ2సీ) బ్రాండ్‌కు శ్రీకారం చుట్టేంతగా. అస్సాంలోని గిరిజనులు తయారు చేసిన అందమైన వెదురు నగలను తన బ్రాండ్ ద్వారా విక్రయిస్తుంది హేమ. మన దేశంలో జువెలరీ అంటే బంగారం, వెండి... అనే అభిప్రాయాన్ని తన బ్రాండ్ ద్వారా మార్చే ప్రయత్నం చేస్తోంది. బయటి ప్రపంచానికి అంతగా తెలియని వెదురు నగలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది.

రకరకాల ప్రాంతాలలో తమ ప్రాడక్ట్స్‌కు సంబంధించి ఎగ్జిబిషన్‌లు ఏర్పాటు చేసింది. మౌఖిక ప్రచారం ద్వారా వెదురు నగల అమ్మకాలు ఊపందుకున్నాయి.

పదిహేను వేలతో వ్యాపారం ప్రారంభించి తన బ్రాండ్‌ను లాభాల బాట పట్టించింది హేమ. వ్యాపార వృద్ధికి సోషల్ మీడియాను ప్రధాన వేదికగా మలుచుకుంది. తమ బ్రాండ్‌కు చెందిన వెదురు నగల చిత్రాలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసేది. దీంతో ఎక్కడెక్కడి నుంచో ఆర్డర్లు రావడం మొదలైంది.

సంప్రదాయ వెదురు ఆభరణాలకు మోడ్రన్ ట్విస్ట్ ఇచ్చి కొనుగోలుదారులను ఆకట్టుకునేలా చేయడంలో హేమ విజయం సాధించింది. నాణ్యమైన వెదురును కొనుగోలు చేసి అస్సాంలోని ట్రైబల్ ఆర్టిస్ట్‌ల దగ్గరికి పంపుతుంది.

'అరవై అయిదు సంవత్సరాల వయసులో మార్కెట్ తీరుతెన్నులను గురించి తెలుసుకోవడం కష్టమే కావచ్చు. ఈ వయసులో అవసరమా అని కూడా అనిపించవచ్చు. అయితే నేను ఎప్పుడూ అలా అనుకోలేదు. కొన్నిసార్లు ప్రయాణమే పాఠాలు నేర్పుతుంది. నా విషయంలోనూ ఇదే జరిగింది. మొదట్లో మా బ్రాండ్ పెద్దగా సక్సెస్ కాలేదు. జరిగిన తప్పులను సవరించుకొని ముందుకు వెళ్లాను' అంటుంది హేమ.

కోడలు తాన్య సహాయంతో మార్కెట్ ప్లేస్‌లను లొకేట్ చేయడం నుంచి సోషల్ మీడియా మార్కెటింగ్, ఫొటోగ్రఫీ వరకు ఎన్నో విషయాలు నేర్చుకుంది హేమ.

'నాణ్యమైన నగల అలంకరణకు బంగారమే అక్కర్లేదు అని చెప్పడానికి బ్యాంబూ జువెలరీ ఉదాహరణ. డబ్బు సంపాదన కోసం ఈ వ్యాపారం ప్రారంభించలేదు. వినూత్నమైన కళను ప్రజలకు చేరువ చేయాలనేది నా ప్రయత్నం' అంటుంది హేమా సర్దా.


హేమా సర్దా

